


వైఎస్ఆర్

నేడు 23వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

'మహాకవి' 'శతావధాని' డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు భూతపురి 88వ జయంతి, 23వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ బహుముఖ ప్రతిభాశాలి అని, కవిగా, అవధానిగా, జ్యోతిష శాస్త్రజ్ఞులుగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ భూతపురి 23వ స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త 'భారత భారతి' పుత్తా పుల్లారెడ్డికి అందజేస్తారని చెప్పారు.

ఇళ్ల స్థలాల రద్దుకు కసరత్తు!

-16 వేలకుపైగా ఇళ్ల స్థలాలు గల్లంతు
- నెల రోజుల్లో సర్వే పూర్తికి ఆదేశాలు
- మండలాల వారీగా బృందాలు ఏర్పాటు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో ఇళ్ల స్థలాల రద్దు కసరత్తు ఊపందుకుంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వ హించిన మంత్రి మండలి సమావేశంలో రాష్ట్ర వ్యా ప్తంగా హౌసింగ్ నిర్మాణాలు చేపట్టని లబ్ధి దారుల ఇళ్ల స్థలాలను రద్దు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసిం ది. జిల్లా రెవెన్యూ, హౌసింగ్ అధికారులు సంయుక్తంగా కడప, అన్నమయ్య జిల్లాల్లో ఇళ్ల నిర్మా ణాలు చేపట్టని లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేశారు.



కడప జిల్లాలో 96,335 పక్కా గృహాలు, అన్నమయ్య జిల్లాలో 79,721 లబ్ధి దారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కడపలో 83,491 ఇళ్లు, అన్నమయ్యలో 79,721 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కడప జిల్లాలోని మైదుకూరు, కమలాపురం డివిజన్లలో ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతి కనిపి స్తోంది. కడప, పులివెందుల, ప్రొద్దు టూరు డివిజన్లలో ఆశించిన పురోగతి కనిపించని పరిస్థితి నెలకొంది. 2024 డిసెంబర్ నాటికి 36,371 వేల ఇళ్లు పూర్తయ్యాయి. ఈలెక్కన 37.75 శాతం మాత్రమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడం గమనార్హం. కూటమి సర్కా రు హౌసింగ్‌శాఖపై దృష్టి సారిం చింది. ఐదేళ్లుగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టని లబ్ధిదారుల డేటాను సేక రిం చింది. ఇళ్లు అవసరం లేని వారి స్థలా లను స్వాధీనం చేసుకోవాలని నిర్ణ యం తీసుకుంది. ఇళు లేని లబ్ధి దారులకు ఇవ్వాలని భావించినట్లు తెలుస్తోంది.

పారదర్శక సర్వేకు ఆదేశాలు

ఉమ్మడి జిల్లాలోని సొంత స్థలాలు, రెవెన్యూ స్థలాలు పొందిన లబ్ధిదారులను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధి దారులు, సొంత స్థలాల్లో ఎందరు, రెవెన్యూ స్థలాలకు చెందిన లబ్ధిదారులు ఎందరున్నారో గుర్తించాలని ఆదేశించింది. మూడు కేటగిరీల్లో హౌసింగ్ పనులు చేపడతామని ముందుకు వచ్చిన లబ్ధిదారులను మినహాయించనున్నట్లు తెలుస్తోంది.

నెల రోజుల్లో సర్వే నివేదిక

ఉమ్మడి జిల్లా పరిధిలో హౌసింగ్ పనులు చేపట్టని లబ్ధిదారుల వివరాలకు సర్వేకు శ్రీకారం చుట్టింది. నెల రోజుల వ్యవధిలో సర్వే నివేదికను అందజేయాలని ఆదేశించింది. హౌసింగ్, రెవెన్యూ యంత్రాంగాలు సంయుక్తంగా మండల స్థాయిలో హౌసింగ్ ఎఇ, తహశీల్దార్, ఆర్ఐ, విఆర్ఒ, సచివాలయ కార్యదర్శులతో కూడిన బృందాలు సర్వే ప్రక్రియకు ఉపక్రమించాయి. కడప, అన్న మయ్య జిల్లా హౌసింగ్ శాఖలు ఐదేళ్లుగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల వివరాలను అందజేసిన సంగతి తెలిసిందే.

16,091 స్థలాలు గల్లంతు?

కడప, అన్నమయ్య జిల్లాల్లో 16,091 ఇళ్లస్థలాలపైగా గల్లంతు కానున్నట్లు తెలుస్తోంది. పారదర్శక సర్వే అనంతరం ఇళ్లస్థలాల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కడప జిల్లాలో 12, 844 మంది హౌసింగ్ లబ్ధిదారులు, అన్నమయ్య జిల్లాలో 3,247 మంది లబ్ధిదారుల ఇళ్ల స్థలాలు వెరసి 16,091 మంది ఇళ్లస్థలాల వివరాలను అందజేసిన సంగతి తెలిసిందే. హౌసింగ్, రెవెన్యూ బృందాల పారదర్శక సర్వే ఆధారంగా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

పనితీరు మెరుగుపరచుకోవాలి

ప్రజాశక్తి - కడప



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

రెవెన్యూ అధికారులు తమ పనితీరు మెరుగుపరచుకొని, అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా, జవాబు దారీతనంతో పని చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ బోర్డు సభా భవన్‌లో పులివెందుల, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహశీల్దార్లు, డిటిలు, విఆర్‌ఒలు, మండల సర్వేయర్లతో రెవెన్యూ అంశాలు, వివిధ చట్టాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం (వర్క్‌షాప్) కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్లగలిగినప్పుడే శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. ఎలాంటి సమస్య అయినా కాలతీతం చేయకుండా వేగంగా స్పందించి చట్టప్రకారం చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పిజిఆర్‌ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను ఆయా గ్రామాల వారిగా క్రోడీకరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించడమే మన బాధ్యత అని తెలియజేశారు. వేగంగా స్పందించి క్షేత్రస్థాయిలో వాస్తవాలు విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకొని అర్జీలను నాణ్యతగా సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమించుకుని వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములు, ఆర్‌ఒఆర్, పట్టాదారు పాస్ పుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి పని చేయాలన్నారు. సమావేశంలో పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయి శ్రీ, పులివెందుల, ల్యాండ్ సర్వే ఎడి మురళీకృష్ణ, జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయరు విఆర్‌ఒలు, రెవెన్యూ సిబంది పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

- మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వచ్ఛభారత్ పేరుతో క్లాప్ బండ్లు కడప, ప్రొద్దుటూరు ఇతర మున్సిపాలిటీలో నడుస్తున్న డ్రైవర్లకు రూ.26వేతనం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా కోశాధికారి గోపి, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, చంద్రారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కడప, ప్రొద్దుటూరులో రెడ్డి ఏజెన్సీ, అలాగే మరో ఏజెన్సీ సాయి పావని ద్వారా కొన్ని బండ్లు నడుస్తుండేవని తెలిపారు. ప్రస్తుతం సాయి పావని ఏజెన్సీ, కొన్ని చోట్ల మున్సిపాలిటీ వారు నడుపుతున్నారని పేర్కొన్నారు. నివాస ప్రాంతాల్లో చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కి పంపిస్తారని తెలిపారు. వీటికి ఒక్కొక్క బండికి రూ.63 వేలు చెల్లిస్తారని పేర్కొన్నారు. అదే స్థాయిలో పనిచేసే డ్రైవర్స్‌కు మాత్రం కనీస వేతనం లేకపోవడం దుర్మార్గమని తెలిపారు. ఏజెన్సీలను రద్దు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని జిఒ నంబర్ 7 ప్రకారం వేతనాలని తెలిపారు. విశాఖలో రూ.18వేలు ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో కొందరికి రూ.24,500 ఇస్తున్నారని తెలిపారు. క్లాప్ డ్రైవర్లకు రూ.26వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలు నడుపుతున్న వారు పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టలేదని తెలిపారు. వీటిపై లేబర్ కార్యాలయంలో విచారణ నడుస్తుందని పేర్కొన్నారు. కనుక మున్సిపల్ అధికారులు జిఒ ప్రకారం వేతనాలు ఇవ్వాలని తెలిపారు.

ప్రేమోన్మాది అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్



నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

సైకో, ప్రేమోన్మాది యువతిపై యాసిడ్ దాడికి తెగబడిన నిందితుడిని గంటల వ్యవధిలో పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడికి కచ్చితంగా శిక్ష పడుతుందని ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు స్పష్టం చేశారు. శనివారం మదనపల్లె డిఎస్‌పి కార్యాలయంలో ప్రేమోన్మాది నిందితుడు గణేష్‌ను అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ యువతిపై యాసిడ్ దాడి, ఆపై కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని గంటల వ్యవధిలో, జిల్లా దాటకుండా పట్టుకున్నామన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించారని తెలిపారు. మదనపల్లె పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న శంకారపు మురళి కుమారుడు శంకారపు గణేష్ గుర్రంకొండ మండలం, నడిమికండ్రిగ పంచాయతీ, ప్యారంపల్లికి చెందిన జనార్ధన కుమార్తె గౌతమి మదనపల్లిలోని ఓ ప్రయివేటు కళాశాలలో చదువుకున్నారని తెలిపారు. అప్పటినుంచి ప్రేమ పేరుతో గౌతమిని గణేష్ వేధించేవాడని, ఆమె నిరాకరించడంతో కక్ష పెంచుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ క్రమంలో గౌతమికి తన మేనత్త కుమారుడితో ఈ నెల 7న నిశ్చితార్థం కాగా ఏప్రిల్ 29న వివాహం కానుంది. జీర్ణించుకోలేని గణేష్ తనకు దక్కని గౌతమి మరెవ్వరికీ దక్కకూడదన్న కక్షతో అఘాయిత్యానికి పన్నాగం పన్నాడన్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం యాసిడ్ కొనుగోలు చేసి గౌతమిపై దాడి చేసేందుకు శుక్రవారం ఉదయాన్నే గౌతమి ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఇంట్లోకి చొరబడి ఆమెతో వాగ్వాదానికి దిగాడని పేర్కొన్నారు. ఆపై వెంట తెచ్చుకున్న యాసిడ్ నోట్లో పోసే ప్రయత్నం చేయడంతో ఆమె ప్రతిఘటించగా ముఖంపై చల్లాడన్నారు. ఇంట్లో ఉన్న కత్తితో ఆమె మెడ, గొంతు, చేతులపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించగా ఆమెకు రక్త గాయాలయ్యాయని చెప్పారు. తనపై గణేష్ దాడిని ప్రతిఘటించిన గౌతమి ప్రాణాలు దక్కించుకునేందన్నారు. తీవ్రంగా గాయపడిన ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఈ ఘటనలో ఫిర్యాదు తీసుకున్న పోలీసులు నిందితుడు కోసం గాలింపు చేపట్టారన్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు సంఘటన జరగ్గా, బెంగుళూరుకు పారిపోయేందుకు సిద్ధంగా ఉన్న నిందితుడిని మధ్యాహ్నం 3 గంటలకు చాకచక్యంగా పట్టుకున్నామని తెలిపారు. నిందితుడిపై నేరం రుజువయ్యేందుకు అన్ని ఆధారాలు సేకరించామని కచ్చితంగా శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. నిందితున్ని గంటల వ్యవధిలో అరెస్టు చేసేందుకు సహకరించిన డిఎస్‌పి కొండయ్య నాయుడు, సిఐలను ఎస్‌పి అభినందించారు.

కక్షపూరిత రాజకీయాలు మానుకోండి

ప్రజాశక్తి - కడప



మీడియాతో మాట్లాడుతున్న దేవిరెడ్డి ఆదిత్య

వైసిపి నాయకులపైనా, కార్యకర్తలపై కక్షపూరితంగా రాజకీయాలకు కడప జిల్లా టిడిపి అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి పాల్పడుతున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య మండిపడ్డారు. ప్రజలకు మేలు చేయడంలో ముందు ఉండాలి కానీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. శనివారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని అనుమతులు ఉన్నా పేద ప్రజలకు నాణ్యమైన నీటిని తక్కువ ధరకే అందిస్తున్నా కేవలం వైసిపి నాయకుడిని అని తన వాటర్ ప్లాంట్ మూసివేయించారన్నారు. తన వాటర్ ప్లాంట్ నిర్మాణానికి 2019 లోనే అనుమతులు ఉన్నాయని, కేవలం రాజకీయ కుట్రలో భాగంగా తనను రాజకీయంగా ఎదుర్కోలేక పేద ప్రజలకు సేవ చేస్తుంటే వాటర్ ప్లాంట్ మూసి వేయించారని ఆరోపించారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా వచ్చిన సొమ్మును పేద ప్రజలకు ఏదో ఒక సేవ కార్యక్రమంలో వినియోగిస్తున్నామని, ఇందులో ఎక్కడ స్వార్థపూరిత రాజకీయాలకు, స్వార్థంగా సంపాదించడం లేదని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులకు నిర్బంధ పరిస్థితులు

ప్రజాశక్తి - కడప అర్బన్ :

స్కూల్ కాంప్లెక్స్‌లు అంటే ఉపాధ్యాయులు నిర్బంధ పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కనీస సెలవు కూడా ఉండవని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎసిబి గురువారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమయాలు పాటించకుండా, ఉత్తర్వులలో సాయంత్రం ఐదు గంటలకు ముగించాల్సి ఉన్న సాయంత్రం ఐదు గంటల తర్వాత యాప్‌లో ఐదున్నర వరకు సమయాన్ని పొడిగించడం, ఐదున్నర తర్వాత కూడా యాప్ పనిచేయకపోవడం వల్ల ముఖ్యంగా మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొ న్నారని పేర్కొన్నారు. మధ్యాహ్నం వరకు పాఠశాలలో ఉండి క్లస్టర్ స్కూల్స్ కాంప్లెక్స్ కు ఒంటిగంటకు చేరుకోవాలని చెప్పడం నిజంగా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడమే అని తెలిపారు.

డిటిసిని పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగర శివార్లలోని పోలీస్ శిక్షణా కేంద్రాన్ని ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ శనివారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్ నుంచి ఎఎస్ఐ స్థాయి సిబ్బందితో ముఖాముఖి మాట్లాడి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నిరంతరం వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటూ మరింత సమర్ధవంతంగా విధులు నిర్వహించేందుకు సీనియర్ పోలీస్ అధికారులు, ఆయా రంగాల్లో లబ్ధప్రతిష్టులైన ఫ్యాకల్టీతో ఇస్తున్న ట్రైనింగ్ క్లాసెస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వ హించాలని, సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా, ఓదార్పుతో మాట్లాడి వారికి సాంత్వన కల్పించేలా వ్యవహ రించాలని ఆదేశి ంచారు. అనంతరం డిటిసి లోని కంప్యూటర్ ల్యాబ్, ప్రిన్సిపల్ కార్యాలయం, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్, బ్యారక్‌లను పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం, ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్ రెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలో ఎస్‌పి ఎర్ర చందనం మొక్కను నాటారు. కార్యక్రమంలో ఆర్ఐ శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

'మాలపాటి'కి వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ స్కాలర్ మాలపాటి మలెంకొండయ్యకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈయన తెలుగుశాఖ ఆచార్యులు ఎం.ఎం. వినోదిని పర్యవేక్షణలో 'ఆధునిక కవిత్వం - బహుజన చైతన్యం'లో పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఉపకులపతి మార్గదర్శకత్వంలో నియమితులైన నిపుణుల బృందం మాలపాటి మలెంకొండయ్య సమర్పించిన థీసిస్‌ను పరిశీలించి డాక్టరేట్‌కు అర్హత ఉందంటూ నిర్ణయించారు. ఈ మేరకు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్‌వికృష్ణారావు నోటిఫికేషన్ జారీ చేశారు. స్కాలర్ మలెంకొండయ్య రాసిన పరిశోధన పత్రాలు పలు జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న అతన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు అభినందించారు. మాలపాటి మలెంకొండయ్య శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ,మర్రిపాడు గ్రామానికి చెందినవారు.

ఘనంగా సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని ఇబ్రహీం ఖలీలుల్లా మస్జీద్ దగ్గర ఉన్న హజరత్ బిలాల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, హెచ్‌బి మోడల్ హై స్కూల్ కరస్పాండెంట్ షేక్.మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో శనివారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని తమ మేధో శక్తిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు అబ్బురపరిచే విధంగా తమ ప్రతిభతో ఉత్తమ ప్రయోగాలు చేయడం ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు తమ ప్రతిభ చాటడానికి సైన్స్ ఫెయిర్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. స్కూల్ సిబ్బందితో రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిలాన్ బాష, పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు, వివిధ స్కూలు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సేవ చేయడం అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్ :



సన్మాన కార్యక్రమంలో సహిత రిసోర్స్ పర్సన్స్

విభిన్న ప్రతిభావంతులకు సేవ చేయడం అభినందనీయమని సమగ్ర శిక్ష పథక సంచాలకులు నిత్యానందరాజు పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో సహిత విద్యా సమన్వయకర్తగా పనిచేసి బదిలీపై వెళ్లిన కేశవరెడ్డిని సహిత విద్య రిసోర్స్ పర్సన్లు సన్మానించారు. ఈ సందర్భంగా నిత్యానంద రాజు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు సేవ చేయాలంటే ఎంతో ఓర్పు, నేర్పు ఉండాలన్నారు. ఆ విభాగంలో దాదాపు ఐదేళ్లు సమన్వయకర్తగా పనిచేసి అందరి మన్ననలు పొందడం మామూలు విషయం కాదన్నారు. సెక్టోరల్ అధికారులు విశ్వనాథరెడ్డి, వీరేంద్ర, రమణమూర్తి, లక్ష్మీనరసింహరాజు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అందించాల్సిన సేవల విషయంలో ఎప్పుడూ రాజీ పడేవారు కాదన్నారు. భవిత రిసోర్స్ పర్సన్లు మమత, రవి, కరుణాకర్, విజయమ్మ, యశోద, కళావతి, రాంబాబు, పాలేటి కేశవ రెడ్డి సేవలు కొని యాడారు. సన్మాన గ్రహీత కేశవరెడ్డి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యలు ఉత్కృష్టమైన పని అన్నారు. అనంతరం కేశవరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కోసం వినతి

ప్రజాశక్తి - కడప : కడపలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా దర్బార్ కార్యక్రమంలో శనివారం టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, కడప నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవికి కడప పాస్టర్లు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కచ్చితంగా క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కోసం తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కడప నగరంలోని పాస్టర్లు మల్లెం విజయభాస్కర్, బిషప్ దేవన్న, పాస్టర్ కస్తూరి సుధాకర్,పాస్టర్ కే. డేవిడ్ రాజు,పాస్టర్ చార్లెస్ విజయ్ కుమార్,పాస్టర్ రాజన్న, పాస్టర్ విజయ శేఖర్, జోసెఫ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గోపవరం : బద్వేల్ పట్టణంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు చెందిన వారికి మెప్మా ఆధ్వర్యంలో నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీం (నాట్స్), ఆశా సొసైటీ వారిచే స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు స్టయిఫండ్‌గా రూ.నెలకు 3,500 ఇస్తారన్నారు.

రాయలసీమ మాలల యుద్ధ గర్జనకు తరలిరండి

ప్రజాశక్తి - బద్వేలు : మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో మాలల యుద్ధ గర్జన రాయలసీమలోని కర్నూలు పట్టణం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 23న నిర్వహిస్తారని రాయలసీమ జిల్లాలోని మాలలు బాధ్యతాయుతంగా లక్షలాదిగా తరలిరావాలని మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మాల వెంకటరావు పిలుపునిచ్చారు. శనివారం మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో మహాసభకు సంబంధించిన రాయలసీమ మాలల యుద్ధ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనటువంటి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ వర్గీకరణ వ్యతిరేకతను చాటాలని, ఈ వర్గీకరణ ముసుగుచాటు క్రిమిలేయర్ పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల నాయకులు కూకట్లపల్లి మురళీ నాగదాసరి చెన్నరాయుడు పొగడతోటి గంగయ్య బండి ఓబయ్య వంకెల సుబ్బరాయుడు దాసరి కృష్ణ పెరుమల చంద్ర పాల్గొన్నారు.

అప్పుడు ఊదరగొట్టి ఇప్పుడు పక్కన పెట్టారు

ప్రజాశక్తి - కడప : ఉమ్మడి మేనిఫెస్టో 2024లో సూపర్ సిక్స్‌లో భాగమైన ప్రతి రైతుకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం ఇస్తామని హామీని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఖరీఫ్‌లో మొండి చేయి చూపించిందని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి అన్నారు. శనివారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కనీసం రబీలోనైనా సాయం అందుతుందని భావిస్తున్న రైతులకు సీజన్ ముగింపు దశకు వస్తున్న ఇప్పటికీ నిరీక్షణ మిగిలిందన్నారు. ప్రభుత్వం రైతు భరోసా పేరుతో కేంద్రం అందించే మొత్తంతో కలిపి ఒక్కో రైతుకు రూ.13500 ఇచ్చిందన్నారు. కౌలు రైతుల్లో గుర్తింపు కార్డు ఉంటే ఓసి సామాజిక తరగతికి చెందిన వారికి మినహా, మిగతా వారికి రైతు భరోసాను వర్తింపజేసింది అన్నారు. తల్లికి వందనం, 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులందరికీ ఏడాదికి రూ.15వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించాలని టిడిపి కూటమిని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.

శిల్పారామం పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్ : శిల్పారామాల చైర్ పర్సన్ రెడ్డి మంజుల రెడ్డి కడప శిల్పారామాన్ని శనివారం సందర్శించారు. బోటింగ్ పాండ్, మెయిన్ ఎంట్రన్స్ గేట్లు, స్క్రాప్ కల్చర్ పార్క్, గేమ్ జోన్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప శిల్పారామానికి అన్నింటికంటే ఎక్కువ ఆదాయం వస్తుందని తెలిపారు. అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తామని చెప్పారు. పిపిటి పద్ధతిలో రీస్టార్ట్ లో అవకాశం కల్పిస్తామని, పిల్లలు ఆడుకోవడానికి కొత్త గేమ్‌లకు అనుమతులు ఇస్తామన్నారు. ముఖ్యంగా చేతి వృత్తుల వారికి స్టాల్స్‌ను తక్కువ ధరకు కేటాయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి పి. శివ ప్రసాద్ రెడ్డి, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన బాబు, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' మన అందరి బాధ్యత

ప్రజాశక్తి- కడప అర్బన్



పరిసరాలను శుభ్రం చేస్తున్న జి జి హెచ్ సూపరింటెండెంట్ రమాదేవి

వైఎస్ఆర్ జిల్లాను స్వచ్ఛరహితంగా రూపొం దించేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాల్లో తాము కూడా భాగస్వాములమే అని జిజిహెచ్ (రిమ్స్) సూపరింటెండెంట్ డాక్టర్ జి.వి. రమాదేవి పేర్కొన్నారు. శనివారం జిజిహెచ్ ప్రాంగణంలో సూపరి ంటెండెంట్ డాక్టర్ రమాదేవి ఆధ్వ ర్యంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది వివిధ విభాగాల వైద్యాధిపతులు మూడవ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టారు. ఈ సందర్భంగా జిజిహెచ్ పరిసరాల్లో ఉన్న చెత్తను, ప్లాస్టిక్‌ను ఏరి వేసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయా మెడికల్ విభాగ అధిపతులు కూడా వారి విభాగాలలో స్వచ్ఛ దివస్ పాటించి శుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ఎంఒలు డాక్టర్. వై.శ్రీనివాసులు, డాక్టర్ రాజేశ్వరి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ యు. రంగస్వామి, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒలు డాక్టర్ సునీత, డాక్టర్ గీత, నర్సింగ్ సూపరింటెండెంట్లు మాధురీ లత, శ్రీకాంత, హెడ్ నర్సులు, నర్సింగ్ ఆఫీసర్లు, వివిధ విభాగాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఎపిజిబి'ని కడపలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి - కడప : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం ఎఐసిసి కో- ఆడినేటర్ ఎస్.ఎ. సత్తార్ ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రాష్ట్రప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రాలు పంపాలని కోరారు. కడప నుంచి అమరావతికి ఎపిజిబి తరలింపు నిర్ణయం సరైంది కాదు అని అన్నారు. కలెక్టర్ స్పందించి సరైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో కదిరి ప్రసాద్ ,హమీద్, ఆసిఫ్ ఖాన్, మైనుద్దీన్, శ్యామలాదేవి, రత్న, కుళాయప్ప పాల్గొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 16న నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఛత్రపతి శివాజీ మరాఠా సేవాసంఘ్, ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు ఎ.వెంకటేశ్వర్లు ఒక ప్రటనలో తెలిపారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు అంబా భవాని దేవస్థానం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రక్షాళనే!

ప్రజాదృష్టి

జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన కొనసాగుతోంది. తాజాగా జిల్లాలోని 20 మంది అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై కలెక్టర్ కొరఢా ఝులిపించిన సంగతి తెలిసిందే. గతేడాది బద్వేల్ రెవెన్యూ కేంద్రం పరిధిలో 16 మంది రెవెన్యూ అధికారులపై కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలోని కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, గోపవరం, బి.మఠం మండలాల్లోని వేలాది ఎకరాల భూములను కొందరు జిల్లాతోపాటు రాష్ట్రేతర బడా భూస్వాములు ఆక్రమించుకున్న సంగతి తెలిసిందే. అక్రమార్కుల ఆక్రమణలను తొలగించినప్పుడే ప్రక్షాళన చేసినట్లు అవుతుందని చెప్పవచ్చు. ఆక్రమణలను తొలగించి, భూములు లేని నిరుపేదలకు పంపిణీ చేసినప్పుడు మాత్రమే నిజమైన ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు అవుతుందని చెప్పవచ్చు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని బి.కోడూరు, బద్వేల్ తదితర మండలాల్లో ఆక్రమణల బారినపడిన భూములను స్వాధీనం చేసుకోవడంతోపాటు రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలకు ఉపక్రమించడం సామాన్యులను ఆకర్షిస్తోంది. భూముల ఆక్రమణలను తొలగింపునకు పరిమితమైతే, మళ్లీ భూముల ఆక్రమణలకు పాల్పడే అవకాశం ఉందనే సత్యాన్ని గ్రహించాలి. ఆక్రమణ భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేసినప్పుడు మాత్రమే సార్థకత చేకూరుతుందని గ్రహించాలి. అలా చేయకుండా ఆక్రమణల భూములను కాగితాల్లోనే ఉంచితే, పాత డాక్యుమెంట్లు సృష్టించి రెవెన్యూ అధికారులను లోబరుచుకునే అవకాశం ఉంది. గత ఐదేళ్లుగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.అన్వేష్ జిల్లాలోని ఆక్రమిత భూములను పేదలకు పంపిణీ చేయాలని ఉద్యమిస్తున్న సంగతి తెలిసిందే. డిఆర్ఒ స్థాయిలో చర్చలకు హాజరై ఆక్రమణల వివరాలను, వాదనల్ని సమర్థంగా వినిపించారు. ఉద్యమ నాయకులను సంప్రదిస్తే ఆక్రమణ భూములు, ఇళ్ల స్థలాల వివరాలను అందించే అవకాశం ఉంది. కలెక్టర్ రెవెన్యూ అధికారుల దగ్గర ఉన్న ఆక్రమణల సమాచారంతోపాటు, సంబంధిత ఉద్యమకారుల దగ్గర ఉన్న సమాచారాన్ని, ఆధారాలను స్వీకరించి, ఆక్రమణల్ని తొలగించినప్పుడు మాత్రమే పారదర్శకంగా రెవెన్యూ ప్రక్షాళనకు సార్థకత చేకూరినట్లు అవుతుందనడంలో సందేహంలేదు. ఒంటిమిట్ట మండల పరిధిలోని పెన్నపేరూరు, జవుకులపల్లి గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలు ఆక్రమణలో ఉన్న సంగతి తెలిసిందే. వీటిపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట మాధవరం గ్రామానికి చెందిన చేనేత కార్మికుని భూమిని అధికార పార్టీకి చెందిన నాయకుని అనుచరులు ఆక్రమించుకుని ఆన్‌లైన్ చేయించుకోవడంతో చేనేత కార్మికుడు కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. అప్పటి ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు మృతుని కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చి, ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబానికి న్యాయం చేస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ అమలు దిశగా కలెక్టర్ కదలితే చంద్రబాబు ఇచ్చిన హామీకి న్యాయం చేసిన వారవుతారనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



నూతన ఆలయంలో ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, నాయకులు

ఆలయ ప్రారంభోత్సవంలో ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని బక్కన్నగారిపల్లెలో నూతనంగా నిర్మించిన సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రారంభోత్సవానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్య దైవం అన్నారు. హిందూ ధర్మం గొప్పదనం బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావుడిగా భావి స్తారని చెప్పారు. జడ్పీటీసీ మాదిరెడ్డి రవికుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, బక్కన్నగారిపల్లె సర్పంచ్ మల్లయ్య, ఎంపీటీసీ వరాలమ్మ, మాజీ సర్పంచ్ బయన్న, నాగసుబ్బయ్య, రమేష్ నాయక్, శ్రీను నాయక్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.
జమ్మలమడుగు రూరల్ : సత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ గిరిజనుల ఆరాధ్య దైవం, ఆదర్శ ప్రాయుడని రాష్ట్ర టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారు నాయక్ తెలిపారు. సేవాలాల్ 286 జయంతిని పురస్కరించుకుని ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు డాక్టర్ హనుమంతు నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రితో కలిసి సేవాలాల్ జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మనోహర్ నాయక్, మూడే రాజా నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా కల్వరి శిలువగిరి వేడుకలు

ప్రజాశక్తి - ముద్దనూరు

జమ్మలమడుగు రహదారిలోని పులికోన ఘాట్ వద్ద ఉన్న కొండలో శనివారం క్రైస్తవులు కల్వరి శిలువగిరి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎల్ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చి పాస్టర్ జెడి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువ ప్రాముఖ్యత వివరించారు. మహిళలు, యువ కులు, క్రైస్తవులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల దృష్ట్యా మైదుకూరు నేస్తం సేవా సంస్థ ప్రతినిధులు శనివారం ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. మైదుకూరు మండలం వనిపెంట గ్రామానికి చెందిన వల్లెం రంగారెడ్డి ఆర్థిక సహకారం చేశారు. కార్యక్రమంలో నేస్తం సేవా సంస్థ సభ్యులు కోగటం కొండారెడ్డి, మీకోసం స్వచ్ఛత సేవా సంస్థ ప్రతినిధి విష్ణువర్ధన్, హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక శ్రీనివాస నగర్‌లోని బాలాజీ కళ్యాణమండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ జబ్బులతోపాటు గుండె, స్త్రీల వ్యాధులకు ప్రత్యేక పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన సలహాలు, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. బిపి, షుగర్, ఇసిజి, టుడీ ఎకో పరీక్షలు, గుండె సంబంధిత సమస్యలున్న వారికి అవసరమైనచో ఖరీదైన యాంజియో గ్రాం పరీక్షలు కూడా చేస్తారని తెలిపారు. పట్టణంలో పేరుగాంచిన వైద్యులుచే పరీక్షించనున్నట్లు ఆయన వివరించారు. పట్టణ ప్రజలతోపాటు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందన్నారు.

అప్పనపల్లెలో సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో..

ఖాజీపేట : మండల పరిధిలోని అప్పనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కడప పట్టణానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శనివారం మలపాక పవన్ కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఉచిత పరీక్షలతోపాటు మందులను ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

వృథా నీరు.. మురుగుతో బేజారు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయతీ పత్తూరు దళిత వాడలో సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. ఈ కాలనీలో కనీస సదుపాయాలు సమ కూరకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు కాల్వలు లేకపోవడం వల్ల సమస్యతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దుర్వాసన భరించ లేకున్నామని, వ్యాధులకు గురికావాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. సమీప పంట కాలువల ద్వారా ప్రవహించే వృథా నీరు జనాలు తిరిగే చోట వచ్చి చేరుతోందని వాపోతున్నారు. ఆ నీరు రోజులు తరబడి నిల్వ ఉండ డం వల్ల ఆ ప్రాంతం మురుగుతో నిండిపోయి తీవ్ర అసౌకర్యంగా మారు తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృథా నీరు బయటికి వెళ్లేందుకు పంట కాలువ ఉండగా ప్రస్తుతం కనుమరుగైపోయింది. ఈ నేపథ్యంలో పంట పొలా లు నీట మునుగుతున్నాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సమస్యలను పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. సమస్యల పట్ల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్పందించి వాటిని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

19న రాయితీ రుణాలకు ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం మంజూరు చేసిన రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 19న ఉదయం 10 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కుళాయమ్మ పేర్కొన్నారు. వేంపల్లె మండలానికి బిసి కార్పొరేషన్‌కు 27, కాపు 7, ఇబిసి 4 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.
ప్రొద్దుటూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన చంద్రన్న స్వయం ఉపాధి పథకం (2024-25) కింద ఉపాధి పొందేందుకు ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు.

27లోపు విశిష్ట గుర్తింపు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల పరిధిలోని రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య నిమిత్తం ఈనెల 27లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎఒ శివమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బిదనంచెర్లలో శనివారం నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు 2 వేల మంది రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నారన్నారు. భూమిగల ప్రతి రైతుకూ ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం వల్ల వ్యవసాయ సేవలు సులభతరం అవుతాయన్నారు. పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు.

ఆస్పత్రి అపరిశుభ్రతపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అపరిశుభ్రత నెల కొం దని ఎమ్మెల్యే ఎన్. వరద రాజులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ విధులు సక్ర మంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని హెచ్చ రించారు. సమ యపాలన పాటించాలన్నారు. రోగులతో మర్యాదగా ఉండా లన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే వరద

హైసెక్యూరిటీ పేపర్స్ నిల్

పది రోజులుగా సచివాలయాలకు అందని వైనం.. ఇబ్బందుల్లో ప్రజలు



సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం ప్రజలకు అందించే పలు రకాల సేవలను మరింత సులభతరం చేయడానికి సచివాలయ వ్యవస్థను గత ప్రభుత్వం అందు బాటులోకి తెచ్చింది. ఇందులో 34 రకాల రెవెన్యూ పనులతోపాటు ఇతర సేవలు అందుబాటులోకి తెచ్చారు. సచివాలయాలలో హై సెక్యూరిటీ పత్రాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో రైతులు వన్ బి, అడంగల్, ఫీల్డ్ మ్యాప్‌తోపాటు ఇతరత్రా సేవలు లభిస్తున్నాయి. సాధారణ ప్రజలకు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, ఇతర సేవలు సచి వాలయంలోని డిజిటల్ అసిస్టెంట్లు అందజేస్తున్నారు. సచివాలయంలో ఎపిజిఎస్‌డబ్ల్యూఎస్ పత్రాలు (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ సెక్రటరీ వార్డు సచి వాలయం) లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించడంతో కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. ఈ పత్రాల కోసం సచివాలయానికి వెళితే హై సెక్యూరిటీ పేపర్ లేదని వెనక్కి పంపుతున్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకుని త్వరగా సచివాలయాలకు హై సెక్యూరిటీ పత్రాలను పంపించాలని ప్రజలు కోరుతున్నారు.

పది రోజులుగా లేని విషయం వాస్తవమే..

సచివాలయాలలో పది రోజులుగా హై సెక్యూరిటీ పత్రాలు లేని విషయం వాస్తవమే. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తెల్ల పేపర్‌పై ప్రింట్ తీసి స్టాంపు వేసి సంతకం చేయాలని డిజిటల్ అసిస్టెంట్లను ఆదేశించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే పత్రాలు తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతాం.

-కృష్ణమూర్తి, ఎంపిడిఒ, సింహాద్రిపురం

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - చాపాడు

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఎంపిపి టి. లక్ష్మయ్య తెలిపారు. స్త్రీశక్తి భవన్ సముదాయ ఆవరణం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు స్వచ్ఛాంధ్ర స్వర్ణ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం కార్యాలయంలో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వీరకిషోర్, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఎస్ఐ చిన్న పెద్దయ్య, ఎంఈఓ రవిశంకర్, వంశీకృష్ణ , ఏఓ మ్యాగీ, ఉపాధి ఏపిఓ జగదీశ్వర్‌రెడ్డి, డాక్టర్ రాజేష్ కుమార్, శ్రీవాణి, ఐసిడిఎస్ సిడిపిఓ సావిత్రమ్మ, సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, టిడిపి నాయకులు హర్షవర్ధన్, సలీం, సర్పంచ్ మహబూబ్ బీ, మాబువల్లి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.
వేంపల్లె : ప్రగతికి మూలం పరిశుభ్రతేనని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛత అనేది మానవాళి మనుగడకు మనోవికాసానికి దోహదపడుతుందన్నారు. కళాశాల ఆవరణలో ఉన్న చెత్తను విద్యార్థులు తొలగించారు. తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, తాళ్లపల్లి వైద్యధికారి స్వాతిసాయి, అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ నాగలక్ష్మిదేవి, అరవింద్, రాజారెడ్డి, కేశమ్మ, ప్రసాద్, రేష్మ, పీడీ తేజేంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా, విద్యార్థులు పాల్గొన్నారు.
ఎర్రగుంట్ల : ఇల్లు, పనిచేసే కార్యాలయాల వద్ద ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని ప్రభుత్వ వైద్యులు జ్యోత్స్న, ప్రియాంక సూచించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాణివనంలోని ప్రభుత్వ ఆసు పత్రి ప్రాంగణమంతా సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేశారు. వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రా డేవిడ్, సచివాలయ సిబ్బంది రవికుమార్, ఎల్లయ్య, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.
ఖాజీపేట : ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఈ ప్రక్రియను బాధ్యతగా భావించాలని ఎంపిడిఒ వెంకటరమణ సూచించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. విద్యార్థులు, అధికారులు పరిశుభ్రతపై నినాదాలు చేశారు. పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.
తొండూరు : తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి డాక్టర్ ఆరిఫుల్లా, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఇఒఆర్‌డి సాయి కుమార్‌రెడ్డి, హెల్త్ ఎడుకేటర్ మల్లయ్య, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ప్రదీప్, అంగన్వాడీ సూపర్వైజర్ రమణమ్మ, పలుశాఖల సిబ్బంది పాల్గొన్నారు.
చెన్నూరు : స్థానిక పంచాయతీలో స్వచ్ఛ ఆంధ-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి చెత్తను తడి, పొడి, హానికారక చెత్తగా వేరు చేసి ఇవ్వడం పైన అవగాహన కల్పించారు. ఉద్యోగులు ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విజయ భాస్కర్, ఎంపిడిఒ కిరణ్ మోహన్ రావు , ఇఒపిఆర్‌డి సురేష్ బాబు, మెడికల్ ఆఫీసర్ శ్రీ చెన్నారెడ్డి, ఎపిఎం వెంకటేష్, వెలుగు సిసిలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గుర్రమ్మ, పంచాయతీ కార్యదర్శి శివ కుమార్ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.
చక్రాయపేట : పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతనివ్వాలని ఎంపిడిఒ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో హై స్కూల్ నుండి ఉప్పలవాండ్లపల్లె మీదుగా చక్రాయపేట గ్రామ సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హర్షద్‌బాషా, జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ షేక్ రంతు బాషా, ప్రధానోపాధ్యాయుడు రామాంజులు, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ నాయక్, వ్యవసాయ అధికారి నవత్‌బాబు, ఎపిఒ రవికుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగ సుహాసిని, హైస్కూలు, జూనియర్ కళాశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.
ముద్దనూరు : రోడ్లు, ఇంటి ముందు తడిపొడి చెత్త వ్యర్థాలను వేయరాదని ఎంపిడిఒ ముకుందారెడ్డి అన్నారు. సర్పంచ్ సరళ ఆధ్వర్యంలో ఎంపిడిఒ అధ్యక్షతన స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఐ దస్తగిరి, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ విన్నీలత, ఎంఇఒ నాగేశ్వర నాయక్, ఉపాధి హామీ ఎపిఒ గంగయ్య, వెలుగు ఏపీఎం అపర్ణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, ఈఓపిఆర్డీ వీరభద్రుడు, ఎఒ వెంకట కృష్ణారెడ్డి, స్వయం సహాయక మహిళలు, ఉపాధి హామీ, ఐసిడిఎస్, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
బ్రహ్మంగారిమఠం : మఠం ఐదు రోడ్ల కూడలి నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి వీరనారాయణ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఎంపిడిఒ వెంగముని రెడ్డి, తహశీల్దార్ దామోదర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, అంగన్వాడీ టీచర్లు, వెలుగు కార్యాలయం సిబ్బంది, టిడిపి నాయకులు శ్రీనువాసుల రెడ్డి, సుధాకర్, పూజ శివయ్య పాల్గొన్నారు.
పులివెందుల టౌన్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని పులివెందుల ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇస్లాంపురం పులివెందుల జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయులు బండి సుధాకర్‌రెడ్డి అధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎక్సైజ్ సిఐ ఎల్.చెన్నారెడ్డి, ఎస్ఐ ఎస్.రామ ప్రసాద్ పాల్గొన్నారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, ప్రసాద్, జగదీష్, మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు, అంగనవాడీ టీచర్ భాను, హెల్త్ వర్కర్స్ మేఘనా, లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

యురేనియం రెండవ ప్లాంట్ ఆపకపోతే నిరవధిక దీక్ష

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పులివెందుల సమీపంలోని తుమ్మలపల్లె యురేనియం రెండవ ప్లాంట్ రెండవ యూనిట్‌ను ఆపకపోతే ఆమరణ నిరాహారదీక్ష చేసేందుకైనా సిద్ధమని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచెం వెంకటసుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లాంట్ వల్ల కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు సమీప భవిష్యత్తులో చరిత్ర పటం నుండి కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రధాని మోడీకి ఈ విషయమై పలుసార్లు విన్నవించామన్నారు. పెడచెవిన పెట్టి కడప జిల్లాలో మురేనియం ప్రాజెక్ట్ రెండవ యూనిట్ ప్రారంభానికి ఏర్పాటు చేయడం సబబు కాదన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల చుట్టుపక్క ప్రజల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. మెండిగా యురేనియం ప్రాజెక్ట్ రెండవ యూనిట్‌ను ప్రారంభిస్తే అదే రోజు ప్రాణత్యాగం చేసైనా అడ్డుకుంటానని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, కలెక్టర్, ఎస్‌పి, ప్రాజెక్ట్ జిఎం, వేముల తహశీల్దార్‌కు ప్రకటన ద్వారా తెలిపానని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ కోరారు. ఎన్‌జిఒ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అధికారంలోకి రావడానికి కూటమి ప్రభుత్వం పేదలకు, కార్మికులకు అనేక హామీలను ఇచ్చిందన్నారు. వాటిపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టి నిరుద్యోగులకు ఉపాధి కల్పన చూపాలన్నారు. నిరుద్యోగ భృతి అందించాలన్నారు. గృహిణులకు ఆదాయ వనరులను సృష్టించి వారిని ఆర్థికంగా బలంగా ఉండేలా చూడాలన్నారు.



కడప రోడ్డులో అధ్వానంగా ఉన్న చెత్తాచెదారం

స్వచ్ఛాంధ్ర అమలు ఇదేనా..!

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని గత నెల 18న ముఖ్యమంత్రి చంద్రబాబు మైదుకూరులో ప్రారంభించారు. నెల గడవక ముందే అధికారులు దానికి తూట్లు పొడుస్తున్నారు. అందుకు నిదర్శనం మైదుకూరు పట్టణంలోని మార్కెట్ వనిపెంట రోడ్డులో దర్శనమిస్తున్న అపరిశుభ్రతే. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రొద్దుటూరు రోడ్డు, కడప రోడ్డులో మాత్రం జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల నుండి సిబ్బందిని పిలిపించి పరిసరాలను శుభ్రం చేయించారు. మిగిలిన ప్రాంతాలను మాత్రం గాలికి వదిలేశారు. వ్యర్థ పదార్థాలు వేసే తొట్టి పూర్తిగా నిండడంతో చెత్తంతా రోడ్డుపైకి చేరింది. ఈ ప్రాంతంలోనే మురుగునీరు ఉండడంతో అపరిశుభ్రత దర్శనమిస్తోంది. మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. మున్సిపాలిటీలో సిబ్బంది కొరత అధికంగా ఉండడంతో డ్రయినేజీ అస్తవ్యస్తంగా మారడానికి ప్రధాన కారణం. ఉన్నతాధికారులు స్పందించి ఇప్ప టికైనా పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. అంతేకాకుండా ప్రజలకు కూడా క్రమం తప్పకుండా పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. శనివారం తూతు మంత్రంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేదల స్థలాల్లో ప్రయివేట్ వ్యక్తుల పెత్తనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కొత్తపల్లె పంచాయితీ అమృత్‌నగర్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన స్థలాల్లో ప్రయివేట్ వ్యక్తుల పెత్తనం ఎక్కువైందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహులు మాదిగ పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుంటూంటే అడ్డుపడి డబ్బులు డిమాండ్ చేస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయం స్థానిక అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. కొన్నేళ్లుగా పేదలు ఇళ్లు నిర్మించుకోలేక పోయారని, ఇప్పుడు కట్టుకుంటున్నారని తెలిపారు. ఈ విషయంలో స్థానిక సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, తహశీల్దార్, ఆర్‌డిఒ చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించకుంటే సోమవారం కలెక్టరేట్ ముందు స్థానిక ప్రజా సంఘాలను కలుపుకొని నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు లక్ష్మయ్య, బాషా, శంకర్ పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరవసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాలు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

అన్ని గ్రామ పంచాయతీల్లో శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సంచాలకులు బి.ఆదిశేషారెడ్డి సూచించారు. మండలంలో ఉపాధి హామీ పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. మల్లేపల్లి గ్రామ పంచాయతీలో వాటర్ అబ్సరప్షన్ ట్రెంచ్, దానిమ్మ తోట పెంపకం, తోట్లపల్లిలో పీడర్ చానల్, కొత్తగా నిర్మించిన గోకులం పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలను పెంచాలని సిబ్బందికి సూచించారు. 60 నుండి 99 రోజులు దగ్గరగా ఉన్న కూలీలకు 100 రోజులు పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పూర్తిస్థాయిలో పనులు మంజూరు చేయించుకోవాలన్నారు.



మాట్లాడుతున్నా ఎస్ఐ తిరుపాల్ నాయక్

అతి వేగం ప్రాణానికి ముప్పు

ప్రజాశక్తి - వేంపల్లె

అధిక వేగం ప్రాణానికి ముప్పు తెస్తుందని ఎస్ఐ తిరుపాల్ నాయక్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దేవి ఇంటర్ కళాశాలలో శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాలు సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహ నాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. తద్వారా ఇతరులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. డ్రైవింగ్‌లో నైపుణ్యం సరిగా లేకపోవడం, రోడ్డు భద్రతా పాటించకపోవడం, అవగాహన లేక పోవడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, అతివేగంతో చాలా ప్రమాదాలు జరుగు తున్నట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు వీధిన పడు తాయన్నారు. చాలా కష్టాలను అనుభవించాల్సి వస్తుందని ఎస్ఐ వివరించారు.
ఎర్రగుంట్ల : ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ తప్పక ధరించాలి అని సిఐ నరేష్‌బాబు తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ముద్దనూరు రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటర్ విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముద్దనూరు

సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.భార్గవి పేర్కొన్నారు. కొరపాడు గ్రామంలో శనివారం ఎస్.భార్గవి ఆధ్వర్యంలో న్యాయవాదులు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గృహహింస, మోటర్ వెహికల్ చట్టాల గురించి ప్రజలకు వివరించారు. ఎఎస్ఐ శ్రీనివాసులు, న్యాయవాదులు, విఆర్ఒ ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ రాంగంగాధర్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పెన్షన్‌లకు అనుమతి ఇవ్వలేదని, సామాజిక పెన్షన్ కొత్తగా పొందడానికి వృద్ధులకు అవకాశం కల్పించాలని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం పెన్షన్ మొత్తం రూ.4000కు పెంచడం హర్షణీయమన్నారు. చాలా మంది పెన్షన్ పొందడానికి సాధికార సర్వే అడ్డంకిగా ఉందన్నారు. కొత్తగా పెన్షన్ పొందాలంటే సర్వే నివేదికకు మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా పిల్లలు ఉన్న వారు ఉద్యోగాలు పొంది వెళ్లి పోయారని, పెద్దలు తగినంత ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారని ఆయన వివరించారు. పెన్షన్‌కు దరఖాస్తు చేసుకో వాలంటే సర్వే రిపోర్ట్‌కు సంబంధం లేకుండా చేయాలని సూచించారు. సాధికార సర్వేకు సంబంధం లేకుండా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునేలా ఉత్తర్వులు ఇస్తే అర్హులకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే వేల దరఖాస్తులు కలెక్టర్ కార్యాలయం, సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ ఉత్తర్వులు కోసం ఎదురు చూస్తున్నాయని తెలిపారు.

సురభి సర్వేయర్‌కు షోకాజ్ నోటీస్

ప్రజాశక్తి - చక్రాయపేట

సురభి గ్రామం నాగలగట్టుపల్లె గ్రామసచివాలయ సర్వేయర్ విజయ్‌కుమార్‌కు షోకాజ్ నోటీసులిచ్చినట్లు డిఆర్ఒ విశ్వేశ్వర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారని ఉపసర్పంచ్ దాసరి ఆంజనేయులు తెలిపారు. ఐపిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి ఫిర్యాదు వచ్చాయన్నారు. జిల్లాలో విఆర్వోలు, సర్వేయర్లు 20 మంది అవినీతికి పాల్పడడంతో వారికి షోకాజ్ నోటీసులిచ్చినట్లు తెలిపారు. అవినీతికి పాల్పడితే ఇదే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు.